అరుణాచల క్షేత్రానికి ఆర్టీసీ బస్సులు

పటాన్‌చెరు టౌన్: భెల్ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు వేశామని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సుధాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అరుణాచల, గిరి ప్రదక్షిణకు భక్తులు అధిక సంఖ్యలో వెళ్తుండడంతో జులై 21 న అరుణాచలంలో జరిగే పౌర్ణమి గిరి ప్రదక్షణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఈ నెల 19వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 8 గంటలకు కాణిపాకం, మధ్యాహ్నం భోజనం, 2 గంటలకు కాణిపాకం నుండి జయలుదేరి సాయంత్రం 5 గంటలకు గోల్డెన్ టెంపుల్' దర్శనం అనంతరం అదే రోజు రాత్రి గోల్డెన్ టెంపుల్ నుండి బయలుదేరి అర్ధ రాత్రి అరుణాచలం చేరుకొని,ఆదివారం 21 న 'పౌర్ణమి' రోజు అరుణాచల 'గిరి ప్రదక్షిణ' చేసుకొని, సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయాణం ఉంటుందని తెలిపారు.హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల వారు తమ దగ్గరలోని బస్టాండ్‌తో పాటు సమీప టీఎస్ ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లు బుక్ చేసుకోవచ్చన్నారు.టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్ 9959226149, 7659029882ను సంప్రదించాలన్నారు.

ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

హఫీజ్‌పేట్: ఇటీవల చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని వార్డు కార్యాలయంలో ప్రారంభించిన ప్రజాపాలన దరఖాస్తుల సేవా కేంద్రాలలో ప్రజలు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. చందానగర్, హఫీజ్‌పేట్, మియాపూర్, మాదాపూర్ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని డీసీ తెలిపారు.

సమస్యలు ఏకరవు పెట్టిన ఎస్‌ఎఫ్‌ఏలు

కూకట్‌పల్లి: జోనల్ కార్యాలయంలో సోమవారం ఎస్‌ఎఫ్‌ఏలతో డిప్యూటీ కమిషనర్ రమేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికుల సమస్యలపై చర్చించారు. మెడికల్ బెనిఫిట్, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులు నియామకంలో జరుగుతున్న జాప్యం వంటి విషయాలను కార్మికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్మికులకు ఇవ్వవలసిన సామగ్రి సున్నం, బ్లీచింగ్, చీపురు కట్టలు సరైన సమయానికి ఇవ్వటం లేదని డీసీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మెడికల్ అధికారి డా. సాలొమన్ ఎస్ఎఫ్‌లపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరిని వేధిస్తూ, దుర్భాషలాడుతు అందరిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. విపరీతమైన పెనాల్టీలు వేస్తూ ఉద్యోగాల నుంచి తీసివేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. మెడికల్ అధికారి డా. సాలొమన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 41, వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 70, బజ్జీమిర్చి 40, కాకరకాయ 45, బీరకాయ 28, క్యాబేజీ 33, బీన్స్ 95, క్యారెట్ 35, గోబిపువ్వు 35, దొండకాయ 28, చిక్కుడుకాయ 95, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలుగడ్డ 38, కీరా 23, దోసకాయ 25, సొరకాయ 11, పొట్లకాయ 18, కంద 60, ఉల్లిపొరక 65, ఉల్లిగడ్డ 34, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 10, చామగడ్డ 38, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 50 నుంచి 60, మునగకాయలు 6 నుంచి 8, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 140, పండుమిర్చి 80, ఉసిరి 60, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

జెడ్‌సీ అపూర్వ్ చౌహాన్‌కు సన్మానం


జెడ్‌సీ అపూర్వ్ చౌహాన్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఎస్‌ఎఫ్‌ఏలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అపూర్వ్ చౌహాన్‌ను సోమవారం మూసాపేట సర్కిల్ ఎస్‌ఎఫ్‌ఏలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందజేసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం మెడికల్ అధికారి డా. సాలొమన్ అరాచకాలపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

విద్య, వైద్య రంగాలలో ఎస్‌ఎంఆర్‌ఏటీ ట్రస్ట్ కృషి అభినందనీయం

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

రాయదుర్గం: విద్య, వైద్య రంగాలలో శ్రీనివాసన్ మునుస్వామి అండ్ రాధా అద్దంకి ట్రస్ట్ (ఎస్‌ఎంఆర్‌ఏటీ) కృషి అభినందనీయమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షరటాన్ హోటల్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూత అందించడం, వైద్యరంగంలో పరిశోధనల ద్వారా మందులు, వసతులు కల్పించేలా చేయడం వంటి వాటికి ట్రస్ట్ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఆయుర్వేద రంగంలో క్యాన్సర్ వంటి రోగాల కోసం పరిశోధనలు చేసి మందులు తయారు చేయించి పేదవారికి అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు.

పార్ట్‌నర్‌షిప్ పేరుతో మోసం చేశారు

హోలిక్ బార్బిక్యూ ఎదుట బాధితుల నిరసన

గచ్చిబౌలి: పార్ట్‌నర్ షిప్ పేరుతో మోసం చేసి బయటకు గెంటివేశారంటూ సోమవారం హోలిక్ బార్బిక్యూ ఎదుట బాధితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్.మౌనిక మాట్లాడుతూ నా భర్త ధరణికి సోదరి అయిన సూర్యదేవర శ్రీలక్ష్మి (కజిన్)తో కలిసి కొండాపూర్‌లో హోలిక్ బార్బిక్యూను 2022లో ప్రారంభించామని తెలిపారు. కొద్ది నెలల్లోనే శ్రీలక్ష్మి తన భర్త అయిన సూర్యదేవర అజయ్ పేరిట హోటల్ రిజిస్ట్రేషన్ చేసిందని, జాయింట్ అకౌంట్‌లోని డబ్బు కూడా తన భర్త అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసిందన్నారు. జరిగిన మోసాన్ని నిలదీస్తే కంపెనీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు శ్రీలక్ష్మి సంతకం చేసిన పేపర్ చేతిలో పెట్టిందన్నారు. రూ.68 లక్షల పెట్టుబడి పెడితే ఒక్క రూపాయి కూడా తిరిగి ఇవ్వకుండా బౌన్సర్‌లను పెట్టి హోటల్‌లోకి రాకుండా భయపెడుతున్నారని మౌనిక ఆరోపించారు. పైగా మంత్రి పేరు చెప్పి చంపుతామని బెదిరిస్తున్నారని వాపోయింది. న్యాయం జరిగే వరకు ఇక్కడే దీక్ష చేస్తామన్నారు.


ఓల్డ్‌బోయిన్‌పల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు బండి రమేష్, దండుగుల యాదగిరి, అమూల్య తదితరులు


పాపిరెడ్డినగర్‌లో నివాళులర్పిస్తున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్‌గౌడ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు


భరత్‌నగర్‌కాలనీలో పోచమ్మ గ్రౌండ్‌లో కేక్ కట్ చేస్తున్న అభిమానులతో దేవిరెడ్డి మనోహర్‌రెడ్డి తదితరులు


బాలానగర్‌లో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తదితరులు

మహానేతకు నివాళి

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని వక్తలు ఆయన సేవలను కొనియాడారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం


కేపీహెచ్‌బీకాలనీ టెంపుల్ బస్టాప్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు బండి రమేష్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తదితరులు


వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ప్రెసిడెంట్ సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న బాలాజీనగర్ వైఎస్సార్ అభిమానులు


దీనబంధుకాలనీలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శేరిలింగంపల్లి ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు సామ్


పర్వత్‌నగర్ వైఎస్సార్ చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, వైఎస్సార్ అభిమానులు


ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

సనత్‌నగర్: అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం తగదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బేగంపేట డివిజన్‌లో వివిధ విభాగాల అధికారులతో కలిసి సోమవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా శ్యాంలాల్‌బిల్డింగ్స్ తాతాచారికాలనీ కమ్యూనిటీ హాల్, ఎరుకల బస్తీ కమ్యూనిటీ హాల్, అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీ హాళ్ల పనులు, మాతాజీనగర్‌లో డ్రైనేజీ, రోడ్ల పనులను పరిశీలించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు అసోసియేషన్ల ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శంకుస్థాపనలు చేసిన పనులను త్వరగా పూర్తి చేసి అసోసియేషన్లకు స్వాధీనం చేయాలన్నారు. సమస్యలు పరిష్కారానికి అవసరమైన నిధులు తాను తీసుకువస్తానని చెప్పారు. సమావేశంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, నాయకులు శ్రీహరి, సురేశ్‌యాదవ్, నరేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు

జహంగీర్‌కు పరామర్శ..

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాలు కోల్పోయిన సీనియర్ కార్యకర్త జహంగీర్‌ను ఎమ్మెల్యే కృష్ణారావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ అండగా ఉంటుందని, ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలి


సమతానగర్‌లో చెత్తను తొలగించి మొక్కలు నాటిన పారిశుద్ధ్య సిబ్బంది

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది హరితహారంలో పారిశుద్ధ్య సిబ్బంది మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఏ సంపత్‌కుమార్, మల్లేష్, రాము అధ్వర్యంలో తోటి పారిశుద్ధ్య సిబ్బంది సమతానగర్, హస్మత్‌పేట చెరువు కట్టపై మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమతానగర్, చెరువు కట్టపై చెత్త వేయొద్దని ప్రజలను కోరారు. తమ సిబ్బంది ఎంతో కష్టపడి వారికి కేటాయించిన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని దీనికి ప్రజలు సహకారించాలని విజ్ఞప్తి చేశారు.

అల్లాపూర్ ఠాణాలో డీసీపీ తనిఖీలు

మోతీనగర్: సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాలానగర్ డీసీపీ ఏ. సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారిపట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారి సమస్యలను సావధానంగా విని వారికి అవసరమైన సమాచారాన్ని అందించడంతో పాటు సత్వరం న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని సూచించారు. ఆయన వెంటన కూకట్‌పలి ఏసీపీ శ్రీనివాసరావు, అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ సీఐ సామల వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.


ఠాణాలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీసీపీ సురేష్‌కుమార్

చర్మ ఆరోగ్యానికి ఆహారంలో మార్పుచేర్పులు

సాక్షి, సిటీబ్యూరో: చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు ఆహారంలో మార్పు చేర్పులు అవసరమని ప్రముఖ కాస్మొటాలజిస్ట్ గీతికా మిట్టల్ గుప్తా అన్నారు. ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తగినంత నిద్ర, ఆహారంలో మార్పు చేర్పులు చేయకుండా పైపూతతో చర్మ సంరక్షణ అసాధ్యమని స్పష్టం చేశారు.

వీసీల నియామకంలో కాలయాపన తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: వీసీల నియామకంలో కాలయాపన తగదని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, ఓయూ కార్యదర్శి రవినాయక్ మాట్లాడారు. శ్రీను, కృష్ణ, శ్రీకాంత్, రాజ్ కుమార్, యశ్వంత్ పాల్గొన్నారు.

మంత్రి పొన్నం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని సమస్యలపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, నాయకులతో వెళ్లి కలిశారు. సమస్యల పరిష్కారానికి తగిన నిధులు అందించాలని మంత్రిని కోరామన్నారు. అనంతరం పార్టీ వ్యవహారాలు, అభివృద్ధి పనుల విషయాలపై చర్చించామని వారు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి చెప్పారన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరామని యాదగిరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున యాదవ్, జంగం కనకరాజు యాదవ్, కుంటన్న, అంజి, భరత్, సందీప్, రమణ, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న టీపీసీసీ కార్యదర్శి యాదగిరి తదితరులు

కలెక్టరేట్‌లో త్వరలో బయోమెట్రిక్

సాక్షి,సిటీబ్యూరో: కలెక్టరేట్ కార్యాలయంలో త్వరలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు.ఇకపై జిల్లా అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది విధి నిర్వహణలో ఆఫీస్ వేళలు, సమయ పాలనను ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుందన్నారు. తరచూ పర్యటనలకు వెళ్లే జిల్లా అధికారులు పలు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో ఆయన మట్లాడుతూ మండలాల పర్యటన సమాచారాన్ని తెలియజేయడం ద్వారా బయోమెట్రిక్‌ను వినియోగించాల్సి ఉంటుందన్నారు. మండలాలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన జిల్లా స్థాయి అధికారులు వారంలో రెండు రోజులు పర్యటించి, నివేదికలను అందజేయాల్సి ఉంటుందన్నారు. అంతకు ముందు ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించటంతోపాటు వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో124 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వనమహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రూరల్, గ్రామపంచాయతీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జిల్లా కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ముదిరాజ్‌లు ఐకమత్యంతో ఉంటే ఏదైనా సాధించొచ్చు


శ్రీవివేకానందనగర్‌లో జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదారాబాద్ అధ్యక్షుడు సురేంద్ర ముదిరాజ్

మోతీనగర్: నిరుపేదలైన ముదిరాజ్ కులస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదారాబాద్ అధ్యక్షుడు సురేంద్ర ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌లో బోరబండ అల్లాపూర్ ముదిరాజ్ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సురేందర్ ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐకమత్యంతో ఉంటూ సంఘటితంగా పోరాడితే ఏదైనా సాధించవచ్చన్నారు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నాయకులు ముదిరాజ్‌లకు ప్రత్యేక హోదా కేటాయించాలని ఆయా పార్టీల నాయకులను కోరారని అన్నారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అన్ని పార్టీలు సగం స్థానం కల్పించాలని కోరారు. అనంతరం బోరబండ అల్లాపూర్ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గడ్డమీది రవీంద్ర ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా శ్యామ్ ముదిరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవీంద్ర ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు జితేందర్, నాయకులు గడ్డమీద రాజు, పిట్టల రాజు, చెన్నయ్య, తుంగం శ్రీనివాస్, సుదర్శన్ ముదిరాజ్, తుంగం రామారావు తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు నిలవకుండా ప్రతిపాదనలు రూపొందించాలి

- కూకట్‌పల్లి జెడ్‌సీ అపూర్వ చౌహాన్
- మూసాపేట డివిజన్‌లో పర్యటన
- స్థానిక సమస్యపై ఆరా

కూకట్‌పల్లి: మూసాపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ సోమవారం స్థానిక అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్‌ఎఫ్‌ఏల హాజరును పరిశీలించారు. మూసాపేటలోని శక్తినగర్‌లోని వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలించారు. శక్తినగర్‌లో నీరు నిలిచే పాయింట్‌ను తొలగించేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. అదే విధంగా రోడ్డు వేసేటప్పుడు వర్షపు నీరు నిలిచిపోకుండా ఉండేందుకు లెవెలింగ్‌ను సరిచూసుకోవాలని సూచించారు.

◆ సీబీసీఐడీ కాలనీలోని మోడల్ మార్కెట్‌ను సందర్శించి భవనానికి సంబంధించిన సమస్యలను తనకు తెలియజేయాలని ఇంజనీర్లలరు ఆదేశించారు. అనంతరం 4వ ఫేజులోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించిన నీటి లీకేజీలను అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవనానికి మరింత నష్టం జరగకుండా మరమ్మతు పనులు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు.

◆ కేపీహెచ్‌బీకాలనీ, 5వ ఫేజులోని రాణి రుద్రమ దేవి స్పోర్ట్స్ పార్కు, కాలనీలోని ఇండోర్ స్టేడియాన్ని సందర్శించారు. చివరగా కేపీహెచ్‌బీ కాలనీలోని కైలాస వనాన్ని పరిశీలించి తోట నిర్వహణ, టాయిలెట్లు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో జోనల్ కమిషనర్ రమేష్, ఈఈ పి.సత్యనారాయణ, డిప్యూటీ ఈఈ పి.ఆనంద్, ఏఈ జి.సాయిప్రసాద్, గేమ్స్ ఇన్‌స్పెక్టర్ వీరానంద్, అధికారులు పాల్గొన్నారు.


మూసాపేట స్పోర్ట్స్ పార్కు, కైలాస వనాన్ని పరిశీలిస్తున్న జెడ్‌సీ అపూర్వచౌహాన్

